

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**ఎక్ సవాల్ మై కరూ**

**ఎక్ సవాల్ తుం కరో**

**హర్ సవాల్ కా సవాల్ హీ జవాబ్ హో!**

హిందీ సినీ సంగీత చరిత్రలో శంకర్ జై కిషన్, శైలేంద్రల కలయిక ఒక అపూర్వమైన ఘట్టం. శంకర్ జై కిషన్‌లకు చదువురాదు. వారికి తమ పేరుతో సంతకం చేయటం నేర్పింది గేయరచయిత శైలేంద్ర. శైలేంద్ర ప్రత్యేకత ఏమిటంటే, మామూలుగా తేలికయిన పదాలలో అత్యద్భుతమైన తాత్త్వికపుటాలోచనలను అలవోకగా ప్రదర్శిస్తాడు. పదాలు ఎంత తేలికయినవంటే 'ఉఫ్' మంటే గాలిలో ఎగిరిపోయే దూదికణం అంతటి తేలిక. కానీ దానిలో భావం ఎంత బరువైనదంటే హిమాలయాలంత! ఇందువల్ల అంతగా చదువులేని శంకర్ జైకిషన్‌లకు పాట అర్ధమవటం, లోతైన భావం బోధపడటమే కాదు తేలికయి, వినగానే పెదవులపై నర్తనమాడి, హృదయానికి పట్టేసే శంకర్ జైకిషన్‌ల బాణీలు మరింతగా ఆకర్షణీయమయ్యేవి. పండితులు, పామరులను మెప్పించేవి. ఈనాటికీ శంకర్ జై కిషన్‌ల బంగారంలాంటి బాణీలకు ఎన్నటికీ తరిగిపోని తావిని అద్దుతూనే ఉన్నాయి శైలేంద్ర పదాలు, వాటి భావాలు.

'ససురాల్' అనే హిందీ సినిమాలో పాట ఇది. సాధారణంగా పాత సినిమాల్లో తప్పనిసరిగా ఉండే సన్నివేశం ఇది. నాయికా నాయకుల నడుమ పోటీ. ఆ కాలంలో కాలేజీల్లో నాయికా నాయకలు పోటీలు పడి అతి చక్కని భావాత్మకమయిన పాటలు పాడేవారు. వారి నడుమ ప్రేమ చిగురించటానికి ఇలాంటి ఓ సన్నివేశం తప్పనిసరిగా ఉండేది. గేయరచయితల ప్రతిభ ఎక్కడ తెలుస్తుందంటే సమయం, సందర్భంలేని ఇలాంటి పాటల సన్నివేశాలలో అత్యంత భావస్ఫోరకము, సున్నితమైన భావాల గేయాలను రచించటంలో. ఆ కాలంలో గేయ రచయితలు ఇలాంటి సన్నివేశాలలో తమ సిద్ధాంతాలను, వ్యక్తిత్వాలను సున్నితత్త్వాన్ని అత్యంత అద్భుతంగా ప్రదర్శించారు. అటు సినిమా వ్యాపార విలువను పెంచారు. ఇటు సమాజానికి చక్కని సాహిత్యాన్ని ఆలోచనలను అందించారు.

ఇలాంటి ఓ సందర్భంలోనే శ్రీశ్రీ 'పాడవోయి భారతీయుడా'లాంటి గీతాన్ని అందించాడు. తన సిద్ధాంతాన్ని, ఆలోచనలను ప్రజలకు చేరువచేశాడు. ఇలాంటి ఓ నృత్యం సందర్భంలోనే కృష్ణశాస్త్రి, 'నీలమోహనా రారా ' లాంటి అత్యద్భుతమైన భావగీతాన్ని అందించాడు. అలాగే హిందీలో సాహిర్ 'తెరె ప్యార్‌కా ఆసరా చాహతాహూ' అనే పాటలో ప్రేమతత్త్వాన్ని చిలికించాడు. మజ్రూహ్ 'జుల్‌ఫ్‌కీ ఛావోమే' అంటూ ప్రశ్న కాని ప్రశ్నకు జవాబుకాని జవాబునిచ్చే చమత్కారమైన పాటను సృజించాడు 'మేరె మహబూబ్ తుఝే ' అంటూ షకీల్ అతి సున్నితమైన ప్రేమ భావనల పన్నీటి జల్లు చిలకరించాడు.

వీరందరికీ భిన్నంగా శైలేంద్ర సవాల్ - జవాబ్, ప్రశ్న - సమాధానాల పాటను సృజించాడు. ప్రశ్న సమాధానాల పాటలు చాలానే ఉన్నాయి.

**ఆంఖోమే క్యాజీ?**

**రుపహలా బాదల్**

**బాదల్ మే క్యాజీ?**

**కిసీకా ఆచల్**

**ఆచల్ మే క్యాజీ?**

**అజబ్ సే హల్‌చల్.**

నౌ దో గ్యారాహ్ లోని ప్రశ్న సమాధానాల చిలిపి పాట ఇది. కళ్లల్లో ఏముంది? అంటే వెండి రంగు మేఘం అంటాడు. మేఘంలో ఏముంది? ఎవరిదో కొంగు అంటాడు. కొంగులో ఏముంది? అంటే చిత్రమైన సంచలనం అంటాడు. ఇలాంటివే కాక, దేవుడిని ప్రశ్నిస్తూ పాటలు, తానేం తప్పు చేశాడు, తనకీ శిక్షపడిందని వాపోయే పాటలు ఉన్నాయి. కానీ వాటన్నిటినుంచి శైలేంద్ర సృజించిన ఈ ప్రశ్న జవాబుల పాటను వేరు చేసే అంశం ఏమిటంటే, ఈ పాటలో సమాధానం కూడా ప్రశ్నతోనే రావాలి.

'నేనొక ప్రశ్న అడుగుతాను. నువ్వొక ప్రశ్న అడుగు. ప్రశ్నకు ప్రశ్ననే సమాధానం కావాలి.' ఇదీ ఛాలెంజ్. ఇలాంటి పాట అంతకు ముందు లేదు. ఆ తరువాత రాలేదు. ఈ పాటలో ప్రశ్నకు ప్రశ్నతో సమాధానం ఇవ్వటంలో శైలేంద్ర చూపిన చమత్కారం అమోఘం. అంతేకాదు, ప్రశ్నలోనూ, సమాధానంలోనూ పాత్రల వ్యక్తిత్వాన్ని స్పష్టం చేస్తూ కథాగమనానికి తోడ్పడతాడు శైలేంద్ర. అత్యద్భుతమైన గేయ రచనా సంవిధానం ఇది.

**ప్యార్‌కి బేలా సాథ్ సజన్ కా ఫిర్ క్యూ దిల్ ఘబరాయే**

**నైహర్ సే ఘర్ తీ దుల్ హన్ క్యో నైనా ఛల్కాయే**

ఇది ప్రశ్న. నాయకుడు నాయిక ప్రేమలో ఉన్నాడు. ప్రేమలో ఉన్నవారి మనస్సులో జనించే సందేహం ఇది. సాధారణంగా ప్రేమికులు ఒంటరిగా ఉన్నప్పుడు ప్రియుడికి ఉత్సాహం, ఉత్తేజం ఉంటుంది. స్త్రీ ఉత్సాహం, ఉత్తేజంలో భయం కలిసి ఉంటుంది. ఈ భయం పలురకాలు. ఒకటి తనలో కలుగుతున్న వినూత్నమైన సంచలనాలు అర్థంకాక వాటి పర్యవసానమేమిటోనన్న భయం. తాను వివశ అవటంవల్ల కలిగే భయం అది. మరొకటి సమాజానికి సంబంధించిన భయం. 'ఎవరికయినా తెలిస్తే ఎలా?' ఇలాంటి భయం. మగవాడికి ఆవేశం ఉంటుంది. ఆడవారికి ఆలోచన ఉంటుంది. ఎందుకంటే, ప్రేమలో ఏ మాత్రం పొరపాటు జరిగినా నష్టం మహిళకే అధికంగా ఉంటుంది. అందుకు ముందుకు దూకే మగవారి దూకుడుకి మహిళ అడ్డుకట్ట వేస్తుంది. ఆలోచించమంటుంది. సమాజాన్ని చూసి భయపడమంటుంది. దీన్నే ప్రస్తావిస్తున్నాడు నాయకుడు. వెంట ప్రియుడు ఉన్నా ప్రేయసి హృదయంలో వెరపు ఎందుకుంటుంది? కోరుకున్న వాడితో వివాహమయి అత్తగారింటికి వెళ్లేటప్పుడు పెళ్లి కూతురు కళ్లు ఎందుకు చెమరుస్తాయి? ఎందుకని ఆమె దుఃఖిస్తుంది?

చక్కని సున్నితమయిన ప్రశ్నలు నాయకుడు నాయికను సమస్త స్త్రీలకు ప్రతీకగా చూసి వారి మనస్థత్వం గ్రహించాలని చూస్తున్నాడు. సానుభూతిగా స్పందిస్తున్నాడు. దీనికి నాయిక ప్రశ్నలో సమాధానం అత్యద్భుతంగా ఉంటుంది.

**హై మాలూంకి జానా హోగా, దునియా ఏక్ సరాయ్**

**ఫిర్ క్యూ జాతేవక్త్ ముసాఫిర్ రోయే ఔర్ రులాయె**

ఇక్కడ శైలేంద్ర తాత్వికత స్పష్టంగా తెలుస్తుంది. మమూలు సందర్భాలలో మానవ జీవిత సత్యాలను, సార్వజనీన భావాలను పొదిగి పాట విలువను పెంచటం కనిపిస్తుంది. పెళ్లిచేసుకుని వెళ్లేటప్పుడు పెళ్లికూతురు ఎందుకు రోదిస్తుంది? ప్రియుడితో ఉన్నప్పుడు కూడా భయం ఎందుకన్న చిలిపి ప్రశ్నకు అత్యంత లోతైన జవాబు. ఈ ప్రపంచంలో ఏవీ శాశ్వతం కాదని తెలుసు. ఇక్కడ జన్మించేవారికి మరణం తప్పదని తెలుసు. అంటే ఈ ప్రపంచం కాస్సేపు విశ్రాంతి తీసుకునే తాత్కాలిక గృహంలాంటిదని తెలుసు. అయినా వెళ్లే సమయంలో ప్రయాణీకుడు ఎందుకని ఏడుస్తాడు? ఏడిపిస్తాడు? అంటోంది. దాన్లోనే సమాధానం ఉంది. తవ్వుకునేవారికి తవ్వుకునేంత. మామూల్లు సినిమా పాటలో ఎంత తాత్వికత! ఎంత లోతైన భావం!

**చాంద్ కి మాథే దాగ్ హై ఫిర్ భీ చాంద్ కొ లాజ్ న ఆయే**

**ఉస్కా ఘట్ తా బఢ్తా చెహరా క్యో సుందర్ కహలాయే.**

నాయిక అడిగే ప్రశ్న ఇది.

చంద్రుడిలో మచ్చ ఉంది అయినా చంద్రుడు సిగ్గుపడడు. పెరిగి తరిగే చంద్రుడి అందాన్ని ఎందుకు పొగుడుతారు? సమాధానం చూడండి.

**కాజల్ సే నైనోంకీ శోభా క్యా దుగనీ హోజాయే**

**గోరే గోరే గాల్ పెకాలా తిల్ క్యా మన్‌కో భాయే**

నల్లటి కాటుక కళ్లకు పెట్టుకోవటం వల్ల కళ్ల అందం ఎందుకని ఇనుమడిస్తుంది? తెల్లటి బుగ్గపై నల్లటి చుక్క ఎందుకని హృదయాన్ని దోచుకుంటుంది? 'హర్ సవాల్ కా సవాల్ హీ జవాబ్ హో' అంటే ఇదే. చంద్రుడిలో మచ్చ ఉన్నా ఎందుకని సిగ్గుపడదు? అంటే తెల్లటి బుగ్గపై నల్లటి చుక్కనూ, కళ్ల కాటుకను చూపి ఎందుకని అందం పెరుగుతుందని అడుగుతాడు.

**ఉజియాలే మే జో పర్ఛాయీ పీఛే పీఛే ఆయే**

**వహీ అంధేరా హోనే పర్ క్యా సాథథ్ ఛోడ్ జాయే.**

ఒకో ప్రశ్న వింటున్న కొద్దీ, దీనికి సమాధానంగా ఎలాంటి ప్రశ్న వస్తుందోనన్న ఉత్సాహం జనిస్తూంటుంది. ముఖ్యంగా ప్రశ్నలు అడగటంలో పాత్రల వ్యక్తిత్వాన్ని ప్రదర్శించటం గమనిస్తూంటే రచయిత ప్రతిభకు ఆశ్చర్యం కలుగుతుంది – 'సుసురాల్' సినిమా తెలుగులో 'ఇల్లరికం'. ఈ సినిమా కథ తెలిసిన వారికి నాయకుడి ప్రశ్న దానికి నాయిక సమాధానం రాబోయే సినిమా కథను సూచించటం అర్థం అవుతుంది. నాయకుడు పేదకుటుంబానికి చెందినవాడు. నాయిక ఐశ్వర్యంలో పుట్టి పెరిగింది. ఇద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకుంటారు. కానీ అనూహ్యమైన పరిస్థితులలో వారి నడుమ భేదాభిప్రాయాలు వస్తాయి. నాయకుడిని అందరూ దోషి అంటారు. నాయిక కూడా అనుమానిస్తుంది. ఈ నేపథ్యంతో చూస్తే నాయకుడి ప్రశ్న, అందుకు నాయిక సమాధానం ఇచ్చే ప్రశ్నల అర్థం బోధపడుతుంది. మామూలుగా అనిపించే ప్రశ్న – జవాబు ప్రశ్నల పాటను కూడా శైలేంద్ర సినిమాతో, పాత్రల వ్యక్తిత్వంతో సంబంధం ఉన్న పాటగా తీర్చిదిద్దాడని అర్థమవుతుంది.

**సుఖ్ మే క్యా ఘేరే రహతే హై అప్ నే ఔర్ పరాయే**

**బురీ ఘడీ మేక్యా హర్ కోయీ దేఖ్ కె భీ కతరాయే.**

సాధారణంగా నాయిక నాయకుడిని 'నిను విడను నేనే' అనో 'నీడలా నిన్ను వెన్నంటి ఉంటా' అనో అంటుంది. అందుకని నాయకుడు 'వెలుగులో వెంట ఉండే నీడ చీకటి కాగానే అదృశ్యమౌతుందెందుకని?' అని అడిగాడు. అంటే కష్టాలు రాగానే నీడలాంటి ప్రేయసి కూడా వదిలి వెళ్తుందని సినిమాలో జరగబోయే దాన్ని సూచించినట్టయింది. దానికి సమాధానంగా నాయిక సుఖంలో మనవాళ్లు పరాయివాళ్లు అందరూ చుట్టుముట్టి ఉంటారు, దుఃఖంలో లేక చెడు ఘడియలో ఉన్నప్పుడు అందరూ చూసికూడా దూరం పోతారెందుకు? అనడుగుతుంది. సినిమాలో జరగబోయే దాన్ని చూపిస్తుంది ఇది. అంటే అది స్వాభావికం, నాయకుడిని కష్టాల్లో అపార్థం చేసుకోవటంలో పొరపాటు లేదు అన్నది నాయిక సమాధానంలో వస్తుంది. అయితే, ఈ పోటీలో ఎవరో ఒకరు ఓడిపోవాలి. అది నాయిక అవటమే సమజసం. ఎందుకంటే నాయకుడు పేదవాడు. నాయిక ధనవంతురాలు. పేదల కష్టం తెలియదు. ఇదీ స్వాభావికమే. దీన్ని చివరి చరణం ప్రదర్శిస్తుంది.

**కిస్ కే ఛూనేసే మిట్టీ భీ సోనా బన్ తీ హై**

**కిస్‌కా సాయా పడేతో దౌలత్ మిట్టీ బజ్ఞ్ జాతీ హై**

'ఎవరు తాకటంతోటే మట్టి బంగారం అవుతుంది? ఎవరి నీడ పడటంతో ఐశ్వర్యం మట్టి అయిపోతుంది?' దీనికి సమాధానం ఇచ్చే ప్రశ్న నాయికకు తెలియదు. ఆమె ఓటమిని అంగీకరిస్తుంది. నాయకుడు సమాధాం ఇస్తాడు.

**మెహనత్ – కష్ మిట్టీకో ఛూతో సోనా హోజాయే**

**హాథ్ లగే కాహిల్ కా దౌలత్ మిట్టీమే మిల్‌జాయే.**

కష్టపడి పనిచేసేవాడు తాకటంతోటే మట్టి బంగారం అవుతుంది. నిర్లక్ష్యపరుడు, బద్ధకస్తుడీ చేయిపడితే చాలు ఐశ్వర్యం మట్టిపాలవుతుంది. 'కొండలయిన కరిగిపోవు, కూర్చుని తింటే' అన్నది ధనవంతుడికి తెలియదు. కష్టపడే పేదవాడికి తెలుస్తుంది. రెక్కాడితేకానీ డొక్కాడని వాడికి తెలుస్తుంది. కాబట్టి నాయికకు సమాధానం తెలియక పోవటంలో ఆమె దోషం లేదు. ఆమె నేపథ్యం అలాంటిది. ఇదీ శైలేంద్ర గేయరచన సంవిధానం. పాత్రల వ్యక్తిత్వం ప్రకారమే పాట ఉంది. పాట తేలికగా ఉంది. అర్థం తవ్వితీస్తే అద్భుతం. విశ్లేషిస్తే పరమార్థం. సినిమాకు అన్వయిస్తే ఇంకా గొప్పగా ఉంటుంది

ఈ పాటకు శంకర్ జై కిషన్ కూర్చిన బాణీ అద్వితీయం. శంకర్ జై కిషన్‌లు బాణీలు తయారీలో తమదైన ప్రత్యేక పద్ధతిని ఏర్పాటు చేసుకున్నారు. ఇది తరువాత అందరికీ అనుసరణీయం అయింది. పల్లవి సులభంగా ఉంటుంది. చాలా తేలికగా కొన్ని కొన్ని పదాలతో ఉంటుంది. అయితే వీరు పల్లవిలో పదాలను విరగ్గొట్టరు.

**ఎక్ సవాల్ తుం కరో**

చాలా తేలికగా ఉంటుంది.

నువ్వో ప్రశ్న అడుగు. నేనో ప్రశ్న అడుగుతాను.

**హర్ సవాల్‌కా సవాల్ హీ జవాబ్ హో**

**ప్రతి ప్రశ్నకు ప్రశ్ననే సమాధానం కావాలి.**

ఎక్కడా సంక్లిష్టత లేదు. ఇతర సంగీత దర్శకులు పల్లవిలోనే రాగాలు, గమకాలు, ఆరోహణ, అవరోహణలతో రూపొందిస్తారు. ఇందుకు శంకర్ జై కిషన్ భిన్నం. వారి పల్లవులు సులభంగా, చిన్నగా తేలికగా ఉంటాయి. ఎందుకంటే వీరు ముందుగా బాణీని తయారు చేస్తారు. గేయరచయిత బాణీకి తగ్గట్టుగా పదాలను కూర్చాలి, భావం చెడకుండా! శైలేంద్ర చేసింది అదే. కానీ రచనలో ఎక్కడా పదాలకు తడుముకున్నట్టుగానీ, బాణీకి తగ్గట్టు పదాన్ని కూర్చలేక తననా, ననననాలను వాడినట్టు గానీ అనిపించదు. అన్ని సంపూర్ణమైన వాక్యాలే. స్పష్టమైన భావాలే. ఇక్కడ శంకర్ జై కిషన్ చేసిన మరో చమత్కారం ఏమిటంటే, ఈ పాటకు ఓ స్పష్టమైన రాగం లేదు. సాధారణంగా, బాణీని తయారు చేసేటప్పుడు బాణీ ఏదో ఓ రాగం పై ఆధారపడి సృజించటం జరుగుతుంది. శుద్ధ రాగం కాకున్నా, దానిలో బోలెడంత కల్తీ ఉన్నా, కనీసం ఆరంభమో, మధ్యలో వచ్చే సంగీతమో ఏదో ఓ రాగం పై ఆధారపడి ఉంటుంది. కానీ ఈ పాటలో ఇదీ 'రాగం ' అని చెప్పలేం. కానీ అద్భుతమైన రాగం అనవచ్చు. మధ్యలో నృత్య సంగీతం కూడా వస్తుంది. అత్యంత లయ బద్ధంగా ఉండి పాట వింటూంటేనే మనసును అలరిస్తుంది. విని ఆలోచిస్తే మనసులోలోతుల్లో స్థిరపడుతుంది.

ఇలాంటి ప్రశ్న జవాబుల పాట రాయాలని ఇతరగేయరచయితలు ప్రయత్నించారు కానీ ప్రశ్నకు ప్రశ్న జవాబుగా మరోపాట రాలేదు.

ఆనంద్ బక్షీ 'ఆయాసావన్ ఝూంకే' అన్న సినిమాలో ఓ సందర్భంలో ఇలాంటి ప్రయోగం చేశాడు. కానీ అది యుగళగీతం కాదు. దాంతో ప్రశ్నలోనే సమాధానం ఉండేట్టు రూపొందించాడు పాటను. నాయకుడు పొరపాటున ఓ కారు ఏక్సిడెంట్ చేస్తాడు. ఆ ప్రమాదంలో

నాయిక తండ్రి చనిపోతాడు. ఇప్పుడు తనది పొరపాటని నాయకుడు తండ్రి మరణానికి కారకుడయిన వాడిపట్ల ద్వేషంతో ఊగిపోతున్నట్టు నాయకుడు పాటద్వారా చెప్పాలి. కానీ ఎలా?

**యే షహమాతో జలీ, రోష్ నీ కేలియే**

**ఇస్ షమా సే కహీ ఆగే లగ్ జాయే తో**

**యే షమా క్యాకరే?**

వెలుగు నిచ్చేందుకు దీపం మండుతోంది. కానీ ఆ మంటతో అగ్ని రాజుకుంటే దానిలో దీపం దోషం ఏముంది? ఇదీ పాట పల్లవి. దీపం వెలుగుతున్న ఉద్దేశ్యం మంచిదే. కానీ దీపం వెలగాలంటే మంట ఉండాలి. అందువల్ల ఏదైనా కాలిపోతే దోషం దీపానిదా?

**చల్ కె పూరబ్  సె ఠండీ హవా ఆగయీ**

**ఉఠ్  కి  పర్వత్ సె కాలీ ఘటా ఛాగయి.**

**యే ఘటాతో ఉఠీ ప్యాస్ సబ్ కీ బుఝే**

**ఆషియా పె కిసీ కే గిరీ బిజ్‌లియాతో యే ఘటా క్యాకరే?**

చల్లటిగాలి వీచింది. నల్లటి మబ్బులు అలుముకున్నాయి. అంటే వర్షఋతువు అది. మేఘం వర్షిస్తుంది. ఎందుకంటే ప్రజల దప్పిక తీర్చటంకోసం. కానీ ఆ మేఘాలనుండి వెలువడే ఉరుముల మెరుపుల వల్ల పిడుగుపడి ఇల్లు కాలిపోతే మేఘం ఏం చేస్తుంది? దాని దోషం ఏమిటి?

**పూఛ్ తా హూ మై సబ్‌సే కొయీ దే జవాబ్.**

**నా ఖుదాకి భలా క్యా ఖతా హై జనాబ్**

**నా ఖుదా లేకె సాహిల్ కే జానిబ్ చలా**

**డూబ్ జాయే సఫీనా జూ జొ మఝ్ దార్ మే  నాఖుదా క్యా కరే.**

నావికుడు పడవని ఒడ్డుకు చేర్చాలనే తీసుకుని బయలుదేరాడు. కానీ పడవ సుడిగుండంలో చిక్కుకుని మునిగిపోతే దీన్లో నావికుడి దోషం ఏముంది?

ఇంతవరకూ ఇచ్చిన ఉదాహరణలు చివరి చరణంలోని అంశాన్ని మరింత బలంగా అర్థం అయ్యేట్టు చేసేందుకే.

**వో జో ఉల్జన్ సి తేరే ఖయాలో మె హై**

**వో ఇషారే భి మేరే సవాలో మె హై**

**యే నిగాహ తొ మిలీ దేఖ్ నే కె లియే**

**పర్ కహీ యె నజర్ దోఖ ఖా జాయె తో, యే నజర్ క్యాకరే?**

నీ కళ్లల్లో ఉన్న సందేహానికి సమాధానం నేను అడిగిన ప్రశ్నలకు సమాధానంలో ఉంది. ఈ కళ్లు చూసేందుకు ఉన్నాయి. కానీ కళ్లు మోసపోతే దాన్లో కళ్ల దోషం ఏముంది? తనని దోషిగా, హంతకుడిగా చూస్తున్న నాయికకు ఈ ప్రశ్నల ద్వారా, వాటి సమాధానాల ద్వారా పరోక్షంగా తన దోష రాహిత్యాన్ని, అమాయకత్వాన్ని  ప్రదర్శిస్తున్నాడన్నమాట నాయకుడు. అతి చక్కని గేయ రచన పద్ధతి ఇది. శైలేంద్రలా రాయకపోయినా శైలేంద్ర స్ఫూర్తితో చమత్కారంగా, సందర్భోచితంగా గేయాన్ని సృజించాడు ఆనంద్ బక్షీ.

'సాజన్' సినిమాలో ఓ రొమాంటిక్ పాట సందర్భంలో ఆనంద్ బక్షీ అత్యంత చమత్కారంగా ప్రశ్న సమాధానాల పాటను సృజించాడు. ఈ పాటలో కూడా ప్రశ్నలో సమాధానం ఉంటూంది. ప్రశ్నకు సమాధానం ప్రశ్నతో ఇవ్వటం ఉంటుంది.

**రేషం కీ డోరీ, కహా జయహై నిందియా**

**చురానేకేచోరీ చోరీ.**

'రేషం కే డోరీ ' అంటే సిల్కుదారం అన్న అర్థం వస్తుంది. సినిమాలో నాయిక కాషాయ రంగు దుస్తులు వేసుకుని వస్తుంది. చిన్న మాటతో నాయకుడిపై కోపించి వెళ్లిపోతూంటుంది. అప్పుడు నాయకుడు ఆమె దుస్తులలోంచి ఓ దారపు పోగును పట్టుకుని లాగుతూ 'రేషం కే డోరీ ' అంటూ పాట అందుకుంటాడు. 'నా నిద్రను దొంగతనం చేసి దొంగతనంగా ఎక్కడకు పోతున్నావు దారమా?' అని అడుగుతున్నాడు చమత్కారంగా. ఇక్కడ నాయకుడు నాయికను పరోక్షంగా రేషం కీ డోరీపై ఆరోపించి ఆమె తన ప్రశాంతతను దొంగతనం చేసుకుని వెళ్లిపోతోందంటున్నాడు.

దానికి నాయిక సమాధానం ప్రశ్నతోనే ఇస్తుంది.

**రేషం కీ డోరీ, కహాజూవూంగీ మై**

**యే చందూ, మై చకోరీతూ చందా మైన్ చకోరీ**

'నేనెక్కడికి పోతాను, నువ్వు చంద్రుడివి. నేను చకోరం. ఎక్కడికీ పోలేదు. అతడిని వదలి ఆమె ఎక్కడికీ పోలేదు. కానీ ఆమె ఈ ప్రశ్న సమాధాన పరంపరను కొనసాగిస్తుంది.

**పీపల్ కేఛయ్యా,**

**తేరీ మేరీ ఎక్ జిందడీ ఓ మేరే సయ్యా**

**ఛోడూ మై జమానా, మైన ఛోడూ తేరీ బయ్యా**

'రావిచెట్టు నీడ' అంటూ నీదీ నాదీ ఒకే జీవితం, అవసరమైతే ప్రపంచాన్ని వదులుతా కానీ నీ చేయి వదలను అంటోంది నాయిక. నన్ను వదిలి ఎక్కడకు వెళ్తున్నావన్న నాయకుడి ప్రశ్నకు 'నిన్ను వదిలి ఎటు వెళ్తాను?' అని ఇంత సమాధానం ఇచ్చిందన్నమాట నాయిక.

**ఇం లీ కే బూటే, కల్ క్యూ న ఆయె**

**మైన బోలూ జావో ఝూటే.**

'చింతచెట్టు' అంటూ నిన్న ఎందుకు రాలేదు, నీతో మాట్లాడను. నువ్వు అబద్దాల కోరు అంటోంది నాయిక చరణం ఆరంభంలో.

**బడీ మజా ఆయె మై మనావూ ఔర్ తూజూతే**

**కోరీ పే ఆరీ, తేరా నాం కర్ దూ జియాలే ఆ పట్టారీ**

నువ్వు కోపంతో ఉంటే నిన్ను బ్రతిమిలాడటం, ప్రసన్నం చేసుకోవటం మజాగా ఉంది. నా హృదయానికి నిన్ను రాణిని చేస్తాను. నువ్వు నాదానివి అంటున్నాడు హీరో. ప్రశ్ననుంచి సమాధానం. సమాధానం నుంచి ప్రశ్నకు అత్యంత చమత్కారంగా, శృంగారభరితంగా సాగుతుందీపాట. అయినా ప్రశ్నకు ప్రశ్న సమాధానం అన్న శైలేంద్ర 'సవాల్'ను మాత్రం ఇంతవరకూ ఏ గేయరచయిత స్వీకరించలేదు. ఆనంద్ బక్షీ ప్రయత్నించాడు కానీ అందుకోలేకపోయాడు. అయితే ఏ రచయితా అందుకోలేని సాహిత్యపుటెత్తులు శైలేంద్ర 'జిస్ దేశ్ మె గంగా బహతీ' సినిమాలోని ఓ పాటలో అధిరోహించాడు. సాధారణంగా 'ఖవ్వాలీ'లో ప్రశ్న సమాధానాల పోటీ, దెబ్బకు దెబ్బ అన్న రీతిలో సాగుతుంది. ఖవ్వాలీ కాని పాటలో ఇలాంటి ప్రశ్నలు, దీటైన జవాబులతో అత్యద్భుతమైన గేయం రచించాడు శైలేంద్ర.

**ఇది వచ్చే సంచికలో**

Post your comments

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)